క్లుప్తంగా

గోవిందుడికి ఏకాదశి పూజలు



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో కొలువైన శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీహరికి శుక్రవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున గోవిందుడికి సుప్రభాత సేవ, అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, తులసీదళ అర్చన నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు పూజా కార్యక్రమాలను నిర్వహించగా ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఏకాదశి పర్వదినాన స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు.

ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కూటమి ప్రభుత్వంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు 34వ డివిజన్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు బండి పుణ్యశీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాల కూడా తీసుకురాలేదని విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాల సేకరణ చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యశోదర్, మాబు, మల్లాది శివ, సుధాకర్, శివకుమారి, యాకోబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో 18వ తేదీ శనివారం ''మాట్లాడుకుందాం రండి '' పేరిట రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సాంబమూర్తి రోడ్డులోని (ఐనాక్స్ వెనుక) షణ్ముఖ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు హాజరవుతారన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయ కర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ముదిగొండ ప్రకాష్, బూదాల శ్రీనివాస్, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, ఉమ్మడి ధనరాజు, మాల మహానాడు అధ్యక్షుడు నత్త యోనా రాజు, గంజి షణ్ముఖ్ తదితరులు ఉన్నారు.

నేటితరానికి ఓంకార్ జీవితం ఆదర్శం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఎంసీపీఐ(యూ)పార్టీ వ్యవస్థాపకులు మద్దికాయల ఓంకార్ స్ఫూర్తిని నేటితరం అందిపుచ్చుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా అన్నారు. ఓంకార్ 17వ వర్ధంతి కార్యక్రమం పంజా సెంటర్‌లో ఎంసీపీఐ(యూ)పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి ఖాదర్‌బాషా, జిల్లా కార్యదర్శి సలీం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, ఎస్.చంద్రశేఖర్ అజ్జు, వాహేద్, ఖాలిద్, తాజ్, ఎండీ మక్‌బుల్, ఫారుక్, సమద్ అజ్మి, మహిళా నాయకులు మున్ని, షాహినా, తదితరులు పాల్గొన్నారు.

కూడలిని తప్పించి వాటర్ ఫౌంటెన్ నిర్మాణం..!

- బైపాస్ రహదారిపై రూ.40 లక్షలతో ఫౌంటెన్, గ్రీనరీ
- జంక్షన్‌లో రోడ్డు కుంచించుకుపోతున్న వైనం



వీఎం రంగా జంక్షన్ నుంచి కబేళా సెంటర్‌కు వెళ్లే రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న వాటర్ ఫౌంటెన్

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నగర సుందరీకరణలో భాగంగా, అహ్లాదకరమైన వాతావరణం కోసం ఎక్కడైనా నాలుగు రోడ్ల సెంటర్‌లో వాటర్ ఫౌంటెన్ నిర్మించడం, దాని చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేయడం సహజం. కానీ 'ఊరందరిదీ ఒక దారి.. ఉలిపికట్టెది ఒక దారి' అన్నచందాన విద్యాధరపురం వంగవీటి మోహనరంగా(సితార) జంక్షన్‌లో నిర్మించాల్సిన వాటర్ ఫౌంటెన్‌ను జంక్షన్‌ను తప్పించి ఒక పక్కగా నిర్మిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ రూ.40 లక్షల వ్యయంతో వాటర్ ఫౌంటెన్ నిర్మాణం, గ్రీనరీ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. బైపాస్ రహదారిలో గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు (లారీలు, భారీ వాహనాలు, ట్రాలీలు) కబేళా సెంటర్‌కు వెళ్లేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో వాటర్ ఫౌంటెన్ నిర్మిస్తే భారీ వాహనాలు యూ టర్న్ తీసుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాహనదారులు అంటున్నారు. అదే విధంగా కబేళా సెంటర్ వైపు నుంచి విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ వైపు, లేదా సొరంగ మార్గంగుండా చిట్టినగర్ వైపు వెళ్లే రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పటికే జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా విగ్రహం వల్ల ఎవరికీ ఇబ్బంది లేకపోయినా..



వీఎం రంగా(సితార) జంక్షన్‌లో గల ట్రాఫిక్ ఐలాండ్

దాని ముందుగా నిర్మించనున్న వాటర్ ఫౌంటెన్‌పై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

జంక్షన్‌లో గల ట్రాఫిక్ ఐలాండ్‌ను తొలగిస్తారా..!

గొల్లపూడి బైపాస్ రహదారి, కబేళా సెంటర్ నుంచి విద్యాధరపురం, విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి కబేళా వైపునకు, అలానే సొరంగ మార్గానికి మధ్య(కూడలి)లో ఉన్న ట్రాఫిక్ ఐలాండ్‌ను తొలగిస్తారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు ఇప్పుడు నిర్మిస్తున్న ఫౌంటెన్‌కు ట్రాఫిక్ అడ్వైజరీ బోర్డ్ అనుమతి ఉందా అన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇప్పటికే సెంటర్‌లో ఉన్న వీఎం రంగా విగ్రహాన్ని ఫౌంటెన్ మధ్యలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అలా చేస్తే విగ్రహం దిమ్మెకు ఉన్న శిలాఫలకంపై ఉన్న పేర్లను తొలగించకుండా యథావిధిగా పెట్టకపోతే సహించమని వీఎం రంగా విగ్రహ కమిటీ సభ్యులు స్పష్టం చేస్తున్నారు. కాగా అనాలోచిత పనులు చేయడంలో నగరపాలక సంస్థ అధికారులు ముందుంటారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



పంజా సెంటర్ సంతకాల సేకరణ కార్యక్రమంలో వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం పంజా సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గతంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకురాలేకపోయారన్నారు. కానీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పరిపాలనలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు కేంద్రం నుంచి అనుమతి తీసుకొచ్చి నిర్మాణం ప్రారంభించారన్నారు. కాగా చంద్రబాబు తన వర్గానికి మేలు చేసేందుకు, కోట్ల రూపాయలు దండుకునేందుకు పీపీపీ విధానమంటూ పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ బాషీ, అతీక్, రమేష్, బత్తుల పాండు, పైడాడ శ్రీనివాసరావు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో క్రీడారంగానికి కొత్త వెలుగులు

- క్రీడా సామగ్రి, ఆట బొమ్మలు మరింత చౌకగా లభ్యం
- కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జీఎస్టీ 2.0 సంస్కరణలతో క్రీడా సామగ్రి, ఆట బొమ్మలు మరింత చౌకగా లభ్యమవుతున్నాయని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం వద్ద ప్రత్యేక ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ఎంఎస్ఎంఈలు కూడా క్రీడా పరికరాల తయారీ విభాగంలో పెట్టుబడులు పెట్టే అవకాశముందన్నారు. దేశీయ తయారీదారులకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ బ్యాట్స్, బాల్స్, క్రీడా దుస్తులు, బ్యాడ్మింటన్ రాకెట్, బ్యాటరీ రహిత బొమ్మలు తదితరాలపై జీఎస్టీ తగ్గిందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐఎంఏలో ఎనస్థీషియా డే వేడుకలు



ఐఎంఏ హాలులో జరిగిన ఎనస్థీషియా డే వేడుకల్లో పాల్గొన్న ప్రముఖ ఎనస్థీషియన్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వరల్డ్ ఎనస్థీషియా డేను పురస్కరించుకుని ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్స్(ఐఎస్ఏ) విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు జరిపారు. గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఈ వేడుకల్లో నగరంలోని సీనియర్ ఎనస్థీషియన్లతో పాటు, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్డియాక్ ఎనస్థీషియన్ డాక్టర్ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ ఎనస్థీషియాకు సంబంధించి అధునాతన విధానాలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటి ద్వారా శస్త్ర చికిత్సల సమయంలో ఇచ్చే ఎనస్థీషియా దుష్ఫలితాలను నివారించగలుగుతున్నట్లు తెలిపారు. అనంతరం ఐఎస్ఏ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ మాట్లాడుతూ ఎనస్థీషియన్లు రోగికి శస్త్ర చికిత్స సమయంలో మత్తు ఇవ్వడమే కాకుండా, క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్, పెయిన్ మేనేజ్‌మెంట్ వంటివి సమర్థంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలు, సీపీఆర్ వంటి వాటిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ గేరా కిరణ్‌కుమార్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ టి.సూర్యశ్రీ, డాక్టర్ దీప్తి, డాక్టర్ కీర్తి, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

కొల్లూరి మృతి సాహితీరంగానికి తీరనిలోటు

విజయవాడ కల్చరల్: ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు అని వేముల ఛారిటీస్ వ్యవస్థాపకుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. నగరానికి చెందిన కవి, సాహితీవేత్త, పత్రికా సంపాదకుడు కొల్లూరి మృతికి గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. గత నలభై సంవత్సరాలుగా సాహితీ, సేవా రంగాలలో కొల్లూరి కృషి వెలకట్టలేనిదన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ద్వారా అనేకమంది యువ కవులను తయారు చేశారన్నారు. ప్రతి ఏటా మహాకవి శ్రీశ్రీ పేరుతో పురస్కారాలను అందజేసేవారన్నారు.

పలు సాహిత్య సంస్థల ప్రతినిధుల సంతాపం

ఎక్స్‌రే కొల్లూరి మృతికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, గోళ్ళ నారాయణరావు కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ సభ్యులు, చింతకాయల చిట్టిబాబు(తెలుగు కళా వాహిని), పరుచూరి విజయలక్ష్మి(మహానటి సావిత్రి కళాపీఠం), శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంపల్లి అశోక్ కుమార్, యువ కవులు అనిల్ డ్యానీ, విద్యావేత్త బండ్ల మాధవరావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పాన్నూరి వెంకట శ్రీనివాసులు, విద్యావేత్త ఎంసీ దాస్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, దామోదర గణపతిరావు, కలిమిశ్రీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కొల్లూరి మృతదేహాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు అందజేశారు.

దుర్గగుడి ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పద్మావతి ప్రమాణం స్వీకారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పద్మావతి ఠాకూర్ శుక్రవారం ప్రమాణం స్వీకారం చేశారు. మహామండపం నాలుగో అంతస్తులోని ఈఓ శీనానాయక్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పద్మావతి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాధాకృష్ణ సమక్షంలో ఆమె ప్రమాణం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.

19న చిత్రకారుడు సన్నాల సంస్మరణ సభ

విజయవాడ కల్చరల్: కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, డ్రీమ్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో చిత్రకారుడు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ సంస్మరణ సభను ఈనెల 19 వ తేదీ ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు, చిత్రకారుడు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో చిత్రకళా ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు ఉరుసు మహోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద గల హజరత్ సయ్యద్ అలీ హుస్సేన్ షా ఖాద్రీ ఉరుసు మహోత్సవం శనివారం ప్రారంభమతుందని దర్గా ధర్మకర్త సయ్యద్ ఖాజా మొహినుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్గా ప్రాంగణం నుంచి రాత్రి తొమ్మిది గంటలకు తారాపేటలోని యాసిన్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపుగా బయలుదేరి బోడెమ్మ హోటల్ సెంటర్, పంజా సెంటర్, ఫోర్మెన్ బంగ్లా తదితర పుర వీధుల్లో తిరిగి తెల్లవారుజామున నాలుగు గంటలకు దర్గా ప్రాంగణానికి చేరుకుంటుందని వివరించారు. అనంతరం గంధాన్ని బాబా సమాధి మీదకు ఎక్కిస్తారని తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు దీపారాధన, అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన అవసరం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలని గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామారావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో విద్యార్థులకు ఎయిడ్స్, టీబీ వ్యాధుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. హెచ్ఐవీ సంక్రమించే మార్గాలను వివరించారు. అలానే ఎయిడ్స్ గురించి.. రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా రోగ లక్షణాలు గురించి కొత్తపేట టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ పోతల ఫ్రాన్సిస్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సైకియాట్రిస్ట్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలి



దినేష్‌రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు తమ లక్ష్యసాధనకు పాటుపడాలని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్) దినేష్‌రెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పీజీ విభాగాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దినేష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తప్పనిసరిగా గొప్ప లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందని వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, విభాగాధిపతులు డాక్టర్ వి.చంద్రశేఖరరావు, డాక్టర్ షేక్ అక్బర్, రాజేశ్వరినాయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ సంవాద్'తో మెరుగైన సేవలు

ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు



ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను తెలుసుకుంటున్న ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైల్వే అధికారులు, ప్రయాణికుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసే దిశగా విజయవాడ డివిజన్‌లో 'అమృత్ సంవాద్' కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్, ప్లాట్‌ఫాం నంబర్ 1లోని బాపూజీ వెయిటింగ్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు, ముఖ్యఅతిథిగా ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు. సమావేశంలో ప్రయాణికులు రైల్వే సేవలు, స్టేషన్‌లోని సౌకర్యాలపై ఏడీఆర్ఎంకు పలు ప్రశ్నలు, సూచనలు తెలియజేశారు. ముఖ్యంగా విజయవాడ–బెంగళూరు మధ్య కొత్త రైలు కోసం అభ్యర్థనలు, మహిళా ప్రయాణికుల భద్రతపై ఆర్పీఎఫ్ సిబ్బంది చేపట్టే చర్యలు, స్టేషన్‌లలో పెద్ద డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు, ప్రయాణికుల సమాచారం కోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఉపయోగించడం, అమరావతి స్టేషన్ అభివృద్ధిలో నవీకరణలు వంటి పలు అభిప్రాయాలను పంచుకున్నారు. శ్రీనివాసరావు ప్రయాణికుల అభిప్రాయాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ డీఈ (ఇన్విరాన్‌మెంట్ అండ్ హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్) ఎం.వంశీకాంత్, పీఆర్‌వో నుస్రత్ ముంద్రుప్కర్, స్టేషన్ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయంలో తక్షణ చర్యలపై మాక్ డ్రిల్



సీపీఆర్ చేస్తున్న రెస్క్యూ టీమ్, అగ్నిమాపక సిబ్బంది

భవానీపురం(విజయవాడ పశ్చిమ): వరదలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన తక్షణ చర్యలతో పాటు ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని గొల్లపూడి కృష్ణానదీ తీరాన శుక్రవారం నిర్వహించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎండీ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్(తాడేపల్లి), ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఉత్వర్వుల మేరకు రెవెన్యూ, అగ్నిమాపక, ఏపీ ఎస్‌డీఎంఏ, పోలీస్, వైద్య, పశుసంవర్థక, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌లో నీళ్లల్లో మునిగిపోయేవారిని ఎలా రక్షించాలో డెమోతో వివరించారు. నీట మునిగిన వ్యక్తులను బయటకు తీసుకువచ్చిన తర్వాత వారికి ఏ విధంగా సీపీఆర్ చేయాలో చూపించారు. అదే విధంగా వరదలు వచ్చినప్పుడు ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో విజయవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి కావూరి చైతన్య, రూరల్ తహసీల్దార్ బి.సుగుణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బక్క విగ్గిన్స్, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుహాసిని, పశుసంవర్థక శాఖ జేడీ హనుమంతరావు, అగ్నిమాపక శాఖ అధికారి ఎ.వి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన మైనార్టీ మోర్చా అధ్యక్షుడు బాష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని ప్రసిద్ధ హజ్రత్ సయ్యద్ షాబుఖారి దర్గాను మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సయ్యద్ బాష శుక్రవారం సందర్శించారు. ఆయనను ఆస్థాన పీఠాధిపతులు అల్తాఫ్ రజా సాదరంగా ఆహ్వానించి ఇస్లాం సంప్రదాయం ప్రకారం సన్మానించారు. దర్గాలో ప్రార్థన నిర్వహించారు. అనంతరం షాబుఖారి బాబా నిత్యాన్నదాన లంగర్ ఖానాలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ దీపావళి బొనాంజా ఆఫర్

- రూపాయికే సిమ్
- నెల రోజుల పాటు అపరిమిత కాల్స్, డెయిలీ 2 జీబీ డేటా

మధురానగర్(విజయవాడసెంట్రల్): దీపావళి పర్వదినం పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్ రూపాయికే సిమ్.. నెల రోజుల పాటు అపరిమిత కాల్స్, డెయిలీ 2 జీబీ డేటా అందిస్తున్నామని బీఎస్ఎన్ఎల్ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ మేనేజర్ ఎల్.శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఈనెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కొత్త సిమ్‌ల కొనుగోలు, వేరే ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారేవారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. ఈ ఆఫర్ వినియోగించుకునేందుకు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ కేర్ సెంటర్‌లో కానీ, రిటైలర్స్‌ను కానీ సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఆత్మనిర్భర్ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ సాంకేతికతతో 4జీ సేవలను దేశ వ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు. 4జీ సేవల ద్వారా బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల డేటా వినియోగం పెరిగిందన్నారు.

ప్రైవేటు వైద్య కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టండి

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పెరిగేలా చర్యలు తీసుకోండి
- ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు



ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్ల పెంపుదల చేయాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష చేస్తున్న నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్య విద్యపై మక్కువతో, వైద్య వృత్తిని చేపట్టాలని కలలు కంటున్న రాష్ట్ర యువత ఆవేదనను అర్థం చేసుకుని రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ నీట్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లు పెంచాలని కోరుతూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కేవలం 30 సీట్లు మాత్రమే పెరిగాయని గుర్తు చేశారు. ప్రైవేటు వైద్య కళాశాలలు కన్వీనర్ కోటా పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటుంటే ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోతోందన్నారు. మధ్యతరగతి, పేద బలహీన వర్గాల కుటుంబాల నుంచి ఎంతోమంది ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నప్పటికీ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యను అభ్యసించే అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాలపై సత్వరమే స్పందిస్తే రాష్ట్రంలోని విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్ల పెంపు సమస్యను పరిష్కరించాలని దీక్షా శిబిరంలో పాల్గొన్న పలువురు తల్లిదండ్రులు నినాదాలు చేశారు. శిబిరంలో ఆంధ్రప్రదేశ్ నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రంగారావు, ఉప కార్యదర్శులు రాధిక, కల్పన, అనూష, లలిత, మాధవి, అరుణ తదితరులతో పాటు బాబ్జి, చంద్రశేఖర్, గణపతిరావు, రఫీ, కిషోర్, మూర్తి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాలేజీకి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన భవానీపురం ప్రెసిడెంట్ వీధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ప్రెసిడెంట్ వీధికి చెందిన అర్షియ పర్వీన్ పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కళాశాలకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి యువతి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తీసుకుని వెళ్లి ఉంటాడని యువతి తల్లి మహమ్మద్ సుల్తానా భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.